

జీవో నెం.1ని ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జీవో నెం.1కి వ్యతిరేకంగా రాష్ట్రంలో ఒకవైపు ఆందోళనలు జరుగుతుంటే పకడ్బందీగా అమలు చేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యాఖ్యలను సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాఉద్యమాలను, పౌరహక్కులను హరించివేసే జీవో నెం.1ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను సమీక్ష చేస్తూ జీవో నం.1ని పటిష్టంగా అమలు చేయాలని నిన్న ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు వచ్చిన వార్తలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని అన్నారు. జీవోనం.1కు వ్యతిరేకంగా రాష్ట్రంలో పౌరహక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు, లాయర్లు, మేధావులు, ప్రజాస్వామికవాదులు, రాజకీయపార్టీలు నిరంతరంగా నిరసనలు, ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోగా మరింత తీవ్రంగా అమలు చేయమని చెప్పడం అంటే ప్రజాభిప్రాయాన్ని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించడమే అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అప్రకటిత నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయని, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల సభలకు అనుమతినివ్వడం లేదని పైగా ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనలకు ముందే గహనిర్బంధాలు, ముందస్తు అరెస్టులు చేస్తున్నారని అన్నారు. పైగా అధికార పార్టీ నిర్వహించే సభలకు ఈ షరతులేవీ వర్తించకపోవడం చూస్తుంటే ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నోరు నొక్కే ప్రయత్నమే ఇది అన్నారు. రాష్ట్రప్రభుత్వ ఈ నిరంకుశ వైఖరిని ప్రజాస్వామికవాదులు, మేధావులు నిరసించాలని, ప్రతిష్టకు పోకుండా ఇప్పటికైనా జీవోనం.1ను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవోను ఉపసంహరించుకోకపోతే వైసిపి ప్రభుత్వం ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

7న చిత్తూరులో నీట్ పరీక్ష

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్‌ను) ఈనెల ఏడవ తేదీ ఆదివారం నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు 912 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరికోసం స్థానిక సత్యనారాయణపురంలోని బివి రెడ్డి సీనియర్ సెకండరీ స్కూల్, మిట్టూరులోని ఆర్కె విద్యాలయం అండ్ జూనియర్ కాలేజీ, సంతపేటలోని బందావన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. 1.30 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైన అనుమతించరు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20గంటల వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) ద్వారా ఎంపిక చేయబడిన ఏజెన్సీల ద్వారా పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, తనిఖీ, రిజిస్ట్రేషన్ బందం పర్యవేక్షణలో విద్యార్థులను లోపలకు అనుమతిస్తారు. పరీక్ష హాల్లోకి విద్యార్థులు కేవలం వారి అడ్మిట్ కార్డు, రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు, ఒక పోస్ట్‌కార్డు సైజు ఫోటో, ప్రభుత్వం వారిచే గుర్తించబడిన ఏదైనా ఒక గుర్తింపు పత్రం (ఆధార్ కార్డు, పాస్పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు), ట్రాన్స్పరెంట్ వాటర్ బాటిల్, శానిటైజర్ బాటిల్ మాత్రమే తీసుకురావలసి ఉంటుంది. పెన్ను, మాస్కు పరీక్ష కేంద్రంలోనే ఇవ్వబడతాయి. విద్యార్థులు సాధారణ దుస్తులు మాత్రమే ధరించవలసి ఉంటుంది. మందపాటి చెప్పులు, బూట్లు, పెద్ద గుండీలు ఉన్న దుస్తులు, ఎటువంటి ఆభరణములు, చేతి వాచీలు, మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవు. నీట్‌పరీక్షకు చిత్తూరులో బీవీ రెడ్డి సీనియర్ సెకండరీ స్కూల్ ప్రిన్సిపల్ టీవీ సుబ్రహ్మణ్యం సిటీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంగా మాట్లాడుతూ విద్యార్థులు ముందురోజే పరీక్ష కేంద్రాన్ని సందర్శించడం వల్ల, పరీక్షరోజు అవసరమైన వస్తువులన్నీ కలిగి ఉండటం వలన ఎటువంటి ఆందోళన లేకుండా పరీక్ష రాయటానికి అవకాశం ఉంటుందన్నారు. ఈవిషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తిగా సహకరించవలసి ఉంటుందని విజ్ఞప్తి చేశారు.

వరసిద్ధుని సేవలో సుప్రీంకోర్టు జడ్జి

ప్రజాశక్తి- ఐరాల: వరసిద్ధి వినాయక స్వామివారిని శుక్రవారం సాయంత్రం దర్శించుకున్న సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ జెకె.మహేశ్వరి, వారితో పాటు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ డి.వెంకటరమణ స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. వారికి జిల్లా జడ్జి ఈ.భీమారావు, జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆలయ పాలక మండలి ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు , వేదపండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని. సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ దంపతులు, హైకోర్టు జడ్జి జస్టిస్ దర్శనం చేసుకున్నా అనంతరం వేదఆశీర్వచన మండపంలో తీర్థ ప్రసాదాలను అందజేశారు. తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి వైవి.వీర్రాజు, చిత్తూరు మూడవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.శ్రీనివాస్, చిత్తూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, చిత్తూరు ఆర్డీఓ రేణుక, ఐరాల తహశీల్దార్ సుశీల పాల్గొన్నారు.



సుప్రీం కోర్టు జడ్జికి తీర్థప్రసాదాలు అందిస్తున్న ఆలయన ఛైర్మన్, ఈవో

421 మందికి రూ.3.26 కోట్లు లబ్ధి



వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా వీడియో కాన్ఫెరెన్స్‌లో జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, ఓసి సామాజిక వర్గాలకు చెందిన పేదకుమార్తెల, విభిన్న ప్రతిభావంతుల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నదని ఈ పథకం పేద కుటుంబాలకు ఒక వరమని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్‌రెడ్డి రెండవవిడత వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కార్యక్రమాన్ని తాడేపల్లి నుండి వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు నగర మేయర్ అముద, జెడ్పి వైస్ ఛైర్మన్ రమ్య, మహిళా శిశు సంక్షేమ స్థాయి సంఘ చైర్మన్ భారతి, జేసి పి.శ్రీనివాసులు, డిఆర్‌డిఏ పిడి తులసి, వివిధ సంక్షేమశాఖల జిల్లాస్థాయి అధికారులు మూర్తి, చిన్నారెడ్డి, నరసింహులు, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకం ద్వారా రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ కుటుంబాలకు చెందిన పేద కుమార్తెల వివాహానికి తమ వంతు ఆర్థిక సహాయంగా రూ.40వేల నుండి రూ.1.50లక్షల వరకు అర్హులైన వివాహిత జంటలకు కులప్రాతిపదికన వివాహ ఖర్చుల నిమిత్తం విడుదల చేయడం జరుగుతున్నదని తెలిపారు. 2వ విడత వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకం కింద జిల్లా వ్యాప్తంగా 421మంది మంది పేదకుమార్తెల వివాహాల కొరకు రూ.3.26కోట్లు లబ్ది చేకూరిందని తెలిపారు. లబ్ధిదారులకు కలెక్టర్ ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా చెక్కును అందజేశారు. సామాజిక వర్గాలవారీగా.. 159 మంది ఎస్‌సి లబ్దిదారులకు రూ.1.6కోట్లు, 19 మంది ఎస్‌టి లబ్దిదారులకు రూ.19లక్షలు, 204మంది బిసి లబ్దిదారులకు రూ.1.07 కోట్లు, 37మంది మైనారిటీలకు రూ.37 లక్షలు, ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు రూ.3లక్షలు లబ్ది చేకూరింది.

అక్రమాలను ప్రశ్నిస్తే నిందలు మోపుతున్నారు

ఎమ్మెల్యే వెంకటే గౌడ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

ప్రజాశక్తి- వికోట: నియోజకవర్గ ప్రజలకు ఇబ్బందులు కలిగించే అధికారులను ప్రశ్నిస్తే తనపై నిందలు వేయడం దారుణమని పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం పత్రిక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వి.కోట మండలం ఖాజీపేట సమీపంలో బుధవారం రాత్రి వాణిజ్యపన్నుల శాఖ అధికారులపై తమ అనుచరులు దాడి చేశారనేది అవాస్తవమన్నారు. గత కొన్నిరోజులుగా వాణిజ్య పన్నులశాఖ అధికారులు వివిధ పొంతనలేని కారణాలు చూపుతూ అంతరాష్ట్ర సరిహద్దు మండలమైన వీకోటలోని వ్యాపారస్తులను జరిమానా కట్టాల్సిందే లేదంటే వాహనాలను సీజ్ చేస్తాం అంటూ బెదిరింపులకు దిగుతున్నాట్టు తనకు వి.కోట వ్యాపార సంఘం యూనియన్ తన దష్టికి తీసుకు వచ్చిందన్నారు. వాణిజ్య పన్నుల అధికారిని ఇందిర ప్రియదర్శిని బుధవారం ఉదయం నుండి రాత్రి 9గంటల వరకు కూడా భారీస్థాయిలో వాహనాలను ఆపి ఎక్కువ మొత్తంలో అక్రమ వసూల్లకు పాల్పడుతున్నట్టు తనకు సమాచారం అందిందని తెలిపారు. అయితే నేను అక్కడికి వెళ్ళగానే ఆధికారులు అక్కడ నుండి మెల్లగా జారుకున్నారని ఏ తప్పు చేయని అధికారులు నన్ను చూసి పారిపోవడంతో అనుమానం కలిగి అడగగా నాపై దురుసుగా ప్రవర్తిచారన్నారు. వారి అక్రమ వసూలు ఆపాలని హెచ్చరించడంతో తనపై దశప్రచారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో వ్యాపారవర్గాలకు అండగా ఉంటానని అధికారులు వేధింపులకు పాల్పడవద్దని ఆయన సూచించారు. అధికారులు తమ విధులు బాధ్యతలు విస్మరించి రాజకీయాలు చేయాలని చూడటం విచారకరమన్నారు.

మామిడి రైతులు నష్టపోకుండా ప్రత్యేక చర్యలు

ఉద్యానవన శాఖ డీడీ



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ డిడి మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో ప్రధానపంటగా సాగుచేస్తున్న మామిడి కోతకాలం వస్తోందని రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన రెడ్డి అన్నారు. శుక్రవారం ఉద్యానభవన్ సమావేశ మందిరంలో తూకాలు, ర్యాంప్‌లకు రానున్న మామిడి పంట గురించి ప్రధానంగా సచివాలయ పరిధిలో ఉన్న ఉద్యానవన అసిస్టెంట్లకు, రైతులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తూకాల గురించి అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్ మాట్లాడుతూ మామిడి రైతులకు తూకాల విషయంలో ఎటువంటి నష్టం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశాల మేరకు ఇప్పటికే తూకాల యంత్రాలను పరిశీలించడం జరిగిందనీ అనుమతులు లేకుండా వున్న వాటిని అనుమతించేది లేదని అటువంటి వాటిని సీజ్ చేయడం జరుగుతోందనీ చెబుతూ ఖచ్చితమైన తూకాలను వేయాలని అన్నారు. రైతులకు తూకం విషయంలో అనుమానం వస్తె రెండు వైపులా తూకం వేయించుకోవాలని అన్నారు. ఆ యంత్రాలు రెన్యువల్ అయ్యాయా లేదా చూడాలని అన్నారు. తూకాల విషయంలో ఏదైనా అనుమానం ఉంటే 93981 54527 పోన్‌నంబర్ ద్వారా తనని సంప్రదించవచ్చు అని అన్నారు. ఈసందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా 33 జ్యూస్ ఫ్యాక్టరీలు ఉన్నాయని, ఈ ఫ్యాక్టరీలకు రోజువారి పదివేల టన్నులు మామిడి కాయలు అవసరమవుతాయని ఈనెల 20వ తేదీ నుంచి దిగుబడి ప్రారంభమవుతుందని మార్కెటింగ్ సౌకర్యాలు 60రోజులు పాటు ఉంటాయని సుమారు ఆరున్నర లక్షల మామిడి కాయలు జ్యూస్ ఫ్యాక్టరీలకు సంబంధించినవి వస్తుందని భావించడం జరుగుతుందన్నారు. ఈ మామిడికి సంబంధించిన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు తూకాల విషయంలో ఎటువంటి మోసం జరగకుండా చూసేందుకు పలు బందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పలు ప్రాంతాలలో ర్యాంపులను ఏర్పాటుచేసి కొంతమంది ఆ యజమానులు రైతుల వద్ద నుంచి నేరుగా కొనుగోలు చేసి ఫ్యాక్టరీలకు పంపడం జరుగుతుందని అక్కడ తూకాల విషయంలో కానీ ధరల విషయంలో కానీ రైతులకు ఇబ్బంది లేకుండా చూడడానికి మార్కెటింగ్ శాఖ, తూనికలు కొలతల శాఖ, ఉద్యానవనశాఖ సంయుక్తంగా సిబ్బందిని నియమించి 60 రోజులపాటు అక్కడ ధరలను ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతుందని అన్నారు. రైతులకు తూకం విషయంలో కొంత అపోహ ఉందని అటువంటి అపోహలు పోగొట్టేందుకే ఈ ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలతో ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈసందర్భంగా పలువురు రైతులకు కవర్లు మామిడి కాయలు కోసే పరికరాలు, ఫ్రూట్‌ఫ్లైకి సంబంధించి నివారించేందుకు ఉపయోగించే ట్రాపర్లు పంపిణీ చేశారు. అనంతరం సిబ్బందికి ర్యాంపు పనిచేసే తీరు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ దివ్య, మార్కెటింగ్ ఏడి పరమేశ్వర్, హార్టికల్చర్ అధికారులు కోటేశ్వరరావు, హరికష్ణ రెడ్డి, రైతులు హార్టికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాడు- నేడు పనులు వేగవంతం చేయండి

కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగర పరిధిలో జరుగుతున్న మనబడి, నాడు- నేడు పనులు మరింత వేగవంతం చేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మనబడి నాడు- నేడు పనుల పురోగతిపై శుక్రవారం నగరపాలక కార్యాలయంలో ఎంఈ ధనలక్ష్మీ, డీఈలు, ఏఈలు, సంబంధిత వార్డు అమినిటీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. నగర పరిధిలో 8 పాఠశాలల్లో మనబడి నాడు-నేడు పనులు జరుగుతున్నాయని పనులు అనుకున్నంత వేగంగా జరగడం లేదన్నారు. పనుల్లో జాప్యంపై పాఠశాలల వారీగా సంబంధిత అధికారులతో సమీక్షించారు. రానున్న వారం రోజుల్లో పనుల్లో పురోగతి చూపించాలన్నారు. జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో పనులు వేగంగా పూర్తిచేయించాలని, చేసిన పనులకు ఎప్పటికప్పుడు ఎక్స్పెండీచర్‌ను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈలు రమణ, వెంకట ప్రసాద్, ఏఈలు, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నాడు-నేడు పనులపై సమీక్షిస్తున్న నగర కమిషనర్ అరుణ

'ఉపాధి' ఏపీఓగా బాల

ప్రజాశక్తి- యాదమరి: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీవోగా బాల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు పాలసముద్రం మండలంలో ఎపివోగా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై యాదమరి మండల ఎపివోగా నియమించారు. ఇక్కడ ఇంఛార్జి ఎపివోగా విధులు నిర్వహిస్తున్న కవితను చిత్తూరు క్లస్టర్ ఎపిడి కార్యాలయానికి ఎంటిసీగా బదిలీ చేశారు.



భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయండి



భూ సేకరణపై అధికార్లతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లాలో వివిధ అభివద్ధి కార్యక్రమాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియలో భాగంగా జాతీయ రహదారులు, ఏపీఎస్పీ డీసీఎల్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరోస్టేషన్‌ల ఏర్పాటు తదితరశాఖలకు సంబంధించి ఉన్న భూసంబంధిత అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అభివద్ధి ప్రగతిపథంలో తీసుకొని వెళ్లేందుకు వివిధ కార్యక్రమాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. జాతీయ రహదారులకు సంబంధించి జరుగుతున్న పనులలో పెండింగ్ ఉన్న భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏపీఎస్పీ డీసీఎల్ వారు జిల్లాలో అవసరమైన చోట సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు ప్రక్రియను తహశీల్దార్లు వెంటనే పూర్తిచేసి ట్రాన్స్కోవారికి అప్పగించాలని తహశీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి బెంగళూరు- చెన్నై ఎక్స్ప్రెస్ హైవేకు ఫేజ్-2, చిత్తూరు- తచ్చూరుకు సంబంధించి భూసమస్యను త్వరితగతిన పరిష్కరించాల్సి తెలిపారు. ఈ సమీక్ష జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, ఎన్‌హెచ్‌ఎఐ పీడీ కార్తీక్‌రెడ్డి, చిత్తూరు, కుప్పం, నగిరి ఆర్డీఓలు రేణుకా, శివయ్య, సుజన, అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ ఆయిషా బేగం, ఏపీఐఐసీ జెడ్ ఎం సోనీ, ట్రాన్స్కో ఈఈ శ్రీహరి, సెజ్ సీఐ జోగేంద్ర పాల్గొన్నారు.

నూతన పరిశ్రమలకు అనుమతి

ఉద్యోగావకాశాలు కల్పించేలా కృషి : కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పేందుకు కావల్సిన అన్ని పరిస్థితులను పారిశ్రామికవేత్తలకు కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు మరింతగా సహకరించాలని, నూతన పరిశ్రమలకు స్థాపనకు అవసరమైన అన్ని అనుమతులను సకాలంలో మంజూరు చేయాలని, ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కషి చేయాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ ఉదయం పోర్టల్‌లో రూ.23.99 పెట్టుబడితో 146 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా 548 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. సింగల్ డెస్క్‌పోర్టల్ ద్వారా మార్చి 25 నుండి మే 4 వరకు 80 దరఖాస్తులు అందగా 49 దరఖాస్తులు ఎస్‌ఎల్‌ఏ స్థాయిలో ఆమోదం పొందాయని, 31 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. ప్రోత్సాహాల కింద 61 క్లైములకు గానూ రూ.15.75కోట్లు విడుదలకు సిఫారసు చేయడమైనదని తెలిపారు. ఇందులో జనరల్ కేటగిరిలో 32 క్లయిములకు గానూ రూ.14.01 కోట్లు, ఓబిసి కేటగిరిలో 6 క్లయిములకు గానూ రూ.8.97 లక్షలు, ఎస్‌సి కేటగిరిలో 19 క్లయిములకు గానూ రూ.1.22 కోట్లు, ఎస్‌సి కేటగిరిలో 4 క్లయిములకు గానూ రూ.42.94 లక్షలు ప్రోత్సాహకాల విడుదలకు సిఫారసు చేయడమైనదని తెలిపారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా130 యూనిట్లు లక్ష్యానికి గానూ 175 యూనిట్లు మంజూరు కాగా రూ.5.79కోట్లతో 158 యూనిట్లు, ఏపి ఖాది విల్లేజ్ ఇండస్ట్రియల్ బోర్డు ద్వారా 98 యూనిట్లు లక్ష్యానికి గానూ 37 యూనిట్లు మంజూరు కాగా రూ.85.19లక్షలతో 19 యూనిట్లు, ఏపిఖాది విల్లేజ్ ఇండస్ట్రియల్ కమిషన్ ద్వారా 56 యూనిట్లు లక్ష్యానికి గానూ 11 యూనిట్లు మంజూరు కాగా రూ.36.52 లక్షలతో 8 యూనిట్లు గ్రౌండ్ అయినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, ఎపిఐఐసిజడ్‌ఎం సోని సుహన, లీడ్ బ్యాంక్ మేనేజర్ శేషగిరిరావు, డిటిసి నిరంజన్ రెడ్డి, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకష్ణ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి జి.మురళి కష్ణ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, డిప్యూటీ కమిషనర్ వెంకట్రామయ్య, ఏపీ ఎస్‌ఎఫ్‌సి బ్రాంచ్ మేనేజర్ రామాంజనేయులు, డిస్టిక్ టౌన్‌అండ్ కంట్రీ ప్లాన్ మధు, జిల్లా రిజిస్టార్ శ్రీనివాస్‌రావు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మదన్మోహన్ రెడ్డి, మార్కెటింగ్ ఎడి పరమేశ్వరం, ఎస్‌పిడిసిఎల్ శేషాద్రి రెడ్డి, డిడి సోషియల్ వెల్ఫేర్ నరసింహులు, చిత్తూరు ఆర్డీఓ రేణుక, ఫుడ్‌ప్రాసెసింగ్ రిప్రెసెంటేటివ్ గోవర్ధన్ బాబి, డిఐఏ రిప్రజెంటేటివ్ ధనంజయ, తదితరులు పాల్గొన్నారు.

8వ రోజు కొనసాగిన ద్రావిడ తాత్కాలిక ఉద్యోగుల సమ్మె

మద్దతు తెలిపిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



సమ్మెలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయ తాత్కాలిక బోధనేతర ఉద్యోగులు, సిబ్బంది చేస్తున్న సమ్మె శుక్రవారంతో 8వ రోజు చేరుకుంది. మూడు నెలల జీతాలు, 12 నెలల అరియర్స్, సిఎఫ్‌ఎంఎస్ ద్వారా జీతాలు, ఉద్యోగభద్రత కల్పించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ మెయిన్ గేట్ ఎదుట తమ అన్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈసందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ వర్సిటీ తాత్కాలిక ఉద్యోగుల సమ్మెకు మద్దతునిస్తూ తన సంఘీభావాన్ని తెలిపారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులతో కలిసి సమ్మెలో పాల్గొని నినాదాలు చేశారు. వర్సిటీ తాత్కాలిక ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్సిటీ ఉద్యోగుల సమస్యలపై గవర్నర్‌కు లేఖ రాయడం జరిగిందని, మీ సమస్యలు పరిష్కరించేంత వరకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రెండు నెలల్లో శాసనమండలి సమావేశాలు ఉంటాయని ఆ సమావేశాల్లో వర్సిటీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు కనీస వేతనాలు సైతం ఇవ్వకపోవడం దారుణంగా ఉందని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వర్సిటీ తాత్కాలిక బోధనేతర సిబ్బంది సమస్యలన్నీ పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

వ్యవసాయ రుణాలను సద్వినియోగం చేసుకోండి

సొసైటీ సీఈవో

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: వ్యవసాయ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ సీఈఓ విజయ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరా భూమి కలిగిన రైతుకు లక్ష రూపాయలు చొప్పున పంట రుణం, ఐదు ఎకరాలు భూమి కలిగిన రైతుకు రూ.12 లక్షలు వరకు, రెండు ఎకరాల భూమి కలిగిన రైతుకు ఇదివరకే కోళ్లఫారం షెడ్డు కలిగి ఉంటే రూ.10లక్షలు వరకు ఇస్తామన్నారు. వ్యవసాయ పరంగా బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకునే వారికి ఏడుశాతం వడ్డీ, వ్యవసాయేతర పరంగా బంగారం తాకట్టు పెట్టి 10శాతం వడ్డితో రుణం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మార్చి నెలా 17న ప్రారంభమైన బంగారం తాకట్టు రుణాలు ఇప్పటివరకు రూ.50లక్షలు మేరకు రుణం అందించినట్లు ఆయన తెలిపారు.

మహిళ సంరక్షణ కార్యదర్శులతో సమీక్ష



ప్రజాశక్తి- పెద్దపంజాణీ: మండలంలో సుస్థిర అభివద్ధి సూచిక మెరుగుపడాలంటే క్షేత్రస్థాయిలో ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు 100శాతం పూర్తికావాలని ఎంపిడీవో శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం మండల అభివద్ధి కార్యాలయంలో మహిళా సంరక్షణ కార్యధర్శులతో సమావేశంలో మాట్లాడుతూ సర్వేలో కీలక భూమిక పోషించాలన్నారు. మండలంలో యస్‌డిజి, ఆయుష్మాన్ భారత్ తదితర సర్వేల్లో పూర్తిచేయాలని అన్నారు. క్షేత్రస్థాయి సర్వేల ప్రగతిపై కలెక్టర్ రోజువారి సమీక్షిస్తున్నారని ప్రస్తుతం ఆయుష్మాన్ భారత సర్వే 78శాతం, హౌసింగ్ ఈకేవైసి 94శాతం, యస్‌డిజి 5 సంవత్సరాల లోపు 70శాతం, 6 నుంచి 9 సంవత్సరాల లోపు 85శాతం, గర్భిణీ స్త్రీల సర్వే విషయంలో 98శాతం పూర్తి అయిందని ఎంపిడిఓ అన్నారు. జిల్లాలో పెద్దపంజాణీ మండలాన్ని ప్రగతి పథంలో ఉంచడానికి అన్నిచర్యలు చేపడుతున్నామని, పేదలందరికి ఇళ్ళు నిర్మాణంలో కలెక్టర్ ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయనున్నామన్నారు. మండలాన్ని ప్రగతి పథంలో నిలవాలంటే సిబ్బంది సహకారం అవసరమని ఎంపిడిఓ శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. సమావేశంలో విస్తరణ అధికారి పవన కుమార్, అన్ని పంచాయతీల మహిళ సంరక్షణ సిబ్బంది ఆరిఫా, కేసవి పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ



ప్రజాశక్తి- పుంగనూరు: పట్టణంలోని పుంగనూరు బైపాస్ మదనపల్లి రోడ్డు సర్కిల్లో శ్రీకష్ణదేవరాయల విగ్రహప్రతిష్టకు ఏర్పాటులో భాగంగా శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. మదనపల్లి రోడ్డులోని భీమగానిపల్లి సమీపంలో ఉన్న బైపాస్ కూడలిలో బలిజల ఆరాధ్య దైవం శ్రీకష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటులో భాగంగా భూమి పూజ చేశారు. శ్రీకష్ణదేవరాయలు విగ్రహ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డిల సహకారంతో పోకల అశోక్ కుమార్, కొండేటి నాగభూషణం సూచనలతో భూమిపూజ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజలను గుర్తించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విగ్రహ ఏర్పాటుకు సహకరించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. కొండవీటి నాగభూషణం, పూల త్యాగరాజు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ గాజుల సుబ్బరాయప్ప, నాన బాలగణేష్, మాజీ కౌన్సిలర్ దేశాల ప్రకాష్, ఎస్విటి సోము, కిషోర్, మధుసూదన్ రాయల్, మురళి, సురేష్, కాంట్రాక్టర్ రమణ పాల్గొన్నారు.

వంట గ్యాస్ రూ.500లకే ఇవ్వాలి

ఏపీ మహిళా సమాఖ్య, ఎన్ఎఫ్ఐడబ్ల్యు డిమాండ్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఏపీ మహిళా సమాఖ్య చిత్తూరు జిల్లా కమిటీ సమావేశం ఎస్టియు కార్యాలయంలో మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు ఎస్ జయలక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి కే.విజయ గౌరీ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నా మహిళల ఓట్లు ప్రధానమని అన్నారు. అలాంటి మహిళలకు ఉపయోగపడుతున్న వంట గ్యాస్ ధర ఆకాశాన్ని అంటుతున్నదని తీవ్రంగా విమర్శించారు. మోడీ ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను పెంచుకుంటూ పోతున్నదని వాపోయారు . రాజస్థాన్ ప్రభుత్వం రూ.500లకే ఎలా గ్యాస్ సిలిండర్ ఇస్తున్నారో ఆంధ్రప్రదేశ్లో కూడా రూ.500లకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజల రక్తాన్ని పీల్చేస్తున్నారని, పేద ప్రజలను దోచి ఆదాని అంబానీ లాంటి బడా బాబులకు ఆస్తులు పెంచుతున్నారని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ ధర 500 రూపాయలకు ఇవ్వాలని కోరుతూ 8వ తారీఖున జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

మాదిగ మహాజన జిల్లా అధ్యక్షులుగా జనార్ధన్



ప్రజాశక్తి- కార్వేటినగరం: మాదిగలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర మాదిగ మహాజన సంఘ అధ్యక్షులు సుధాకర్ బాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సుద్దగుంట వద్ద ఉన్న శివాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు మాదిగలను రాజకీయంగా ఎదగకుండా అణగదొక్కుతున్నారని దుయ్యబట్టారు. అనంతరం మాదిగ మహాజన జిల్లా అధ్యక్షులుగా జనార్ధన్‌ను ఏకగ్రీవంగా ఎంపికైనట్లు రాష్ట్ర మాదిగ మహాజన అధ్యక్షులు సుధాకర్‌బాబు ప్రకటించారు. నూతన జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ మాట్లాడుతూ జిల్లాలోని మాదిగల అభివద్ధికి నిరంతరం కషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో రాజకీయ అభివద్ధికి ప్రతిఒక్కరూ కషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాస్థాయి పదవిని ఇచ్చి బాధ్యతను మరింత పెంచిన రాష్ట్ర మహాజన అధ్యక్షుడు సుధాకర్‌బాబుకు, రాయలసీమ మహాజన ఇన్‌ఛార్జి మునిరత్నం, తిరుమలనాథ్, ముత్యాలరావుకు కతజ్ఞతలు తెలిపారు. సుబ్రహ్మణ్యం, శేషాద్రి, అశోక్, నాగరాజు, శరత్, వెంకటేష్, రుద్రకుమార్, సుబ్బారావు, విజయ్ పలువురు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ పరిష్కారం : డిప్యూటీ సిఎం



ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: మండలంలోని కటికపల్లి, డీకేమర్రిపల్లి, గ్రామ పంచాయతీలలో ఈనెల 1, 2 తేదీలలో రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఆయన దష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎస్ఆర్ పురం తహశీల్దార్ లోకనాథ పిళ్లై, ఎంపిడిఓ కృష్ణయ్య, హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఏపిఎం రోజా, సర్పంచ్ మార్కొండయ్య, వాటర్‌సెట్ మాజీ ఛైర్మన్ గుణశేఖర్ నాయుడు, మండల అధికారులతో కటికపల్లి గ్రామ సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డికె మర్రిపల్లి గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న శ్మశాన వాటిక, గ్రామ గుడి సమస్య, దేవాదాయశాఖ భూముల్లో ఇల్లు కట్టుకున్న వారికి ఇంటిపట్టా, దళితవాడలో స్మశానం సమస్య, కొత్తపల్లి మిట్టలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌ను కలిసి డ్వాక్రా గ్రూపుల ద్వారా జగనన్న హౌసింగ్‌లకు లోన్ సౌకర్యం కల్పించాలని మండలస్థాయి అధికారులు గ్రామస్థాయికి వెళ్లి పరిష్కరించాలన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలసముద్రం: జగన్మోహన్ రెడ్డి పెట్టిన సంక్షేమ పథకాలే అభివద్ధి రెండు కళ్ళని డిప్యూటీ సీఎం కే.నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం పాలసంఘం గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా పడుతుందా లేదని అడిగి తెలుసుకున్నారు. కమ్మపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన డిప్యూటీ సీఎంను టిడిపి నాయకులు విజయ్‌కుమార్, రవినాయుడు అడ్డుకొని, అధికారు నాయకులపై గొడవలకు దిగారు. దీంతో డిప్యూటీ సీఎం పార్టీ నాయకులను నచ్చచెప్పి తీసుకొచ్చారు. పాలసముద్రం గ్రామసచివాలయం, రైతు భరోసాకేంద్రం, పార్టీ కార్యాలయాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు అన్‌బలగం, వైసిపి నాయకులు శేఖర్ యాదవ్, పుష్ప, మండల అధ్యక్షుడు తులసీరామ్ యాదవ్, మాజీ మండల అధ్యక్షురాలు ఇందిరమ్మ, చంద్రశేఖర్ రాజు, ఎంపీటీసీ గోవిందరాజులు, లిఖిత, సర్పంచ్ గాలి మహేష్ బాబు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై దృష్టి సారించండి: జడ్పీ సీఈవో


ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న గహాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు మండలస్థాయి అధికారులు లబ్ధిదారులను ప్రోత్సహించాలని జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి ఎంపీడీవోను ఆదేశించారు. శుక్రవారం జడ్పీ సీఈవో ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గహాలు పూర్తయిన గహాలు వివరాలను తెలుసుకుని, పెండింగ్‌లో వున్న గహాలను యుద్ధ ప్రాతిపదికన నిర్మించుటకు తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ తూతీక శ్రీనివాస్ విశ్వనాథను ఆదేశించారు. అదేవిధంగా వేసవికాలంలో నీటిఎద్దడి నివారణకు తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గహనిర్మాణ టార్గెట్ పూర్తిచేసి గహప్రవేశాలకు సిద్ధం కావాలని, అందుకు అనుగుణంగా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. చలమంగళం వైఎస్ఆర్సిపి నాయకులు డిఎం.లతీఫ్, పంచాయతీ సచివాలయ కన్వీనర్ సతీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి

20న గృహప్రవేశాలకు సిద్ధం చేయండి

జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి



ప్రజాశక్తి -సోమల: ఈనెల 20వ తేదీ సామూహిక గహప్రవేశాలు జరిగే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించి జగనన్న కాలనీలలో గహాల పనులు వేగవంతంగా నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని మండలస్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, హౌసింగ్ సిబ్బందికి జిల్లా పంచాయతీ అధికారిని లక్ష్మీ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు గదిలో మండలస్థాయి అధికారులు, హౌసింగ్ సిబ్బంది కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇంటిస్థలాలను మంజూరు చేసి ఇల్లు కట్టుకునేందుకు రుణాలను ఇచ్చి వారిని ఆదుకుంటుందని అయితే గహనిర్మాణాలు వేగవంతంగా లేకుండా మందకొడిగా సాగుతున్నాయని అన్నారు. 20వ తేదీ సామూహిక గహప్రవేశాల కోసం అన్ని పంచాయతీలలో గహనిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడి గహప్రవేశాలు జరిగే విధంగా ఆలోపు పనులు పూర్తి చేసే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం సోమల పంచాయతీలోని అడుసుపల్లె గ్రామంలో గహనిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి పలు సూచనలను ఇచ్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, తహశీల్దార్ శ్యాం ప్రసాద్‌రెడ్డి, ఈఓఆర్డి గఫూర్, కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే..

సహకార రంగాన్ని తెరిపించాలి

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.క్రిష్ణయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జిల్లాలో మూతబడిన సహకార చక్కెర ఫ్యాక్టరీలు, పాడి పరిశ్రమలను తెరిపించాలని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.క్రిష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీకాళహస్తిలో రైతుసంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వి.క్రిష్ణయ్య మాట్లాడుతూ పాల రైతులకు లీటరుకు 4 రూపాయలు అదనంగా ఇస్తామని చెప్పిన జగన్ ప్రభుత్వం నాలుగేళ్లు గడిచినా అతీగతీ లేదని విమర్శించారు. పాల ధరలను పెంచకపోగా గుజరాత్‌లోని అమూల్ డెయిరీకి రాష్ట్రంలోని పాల రైతులను, సహకార రంగాల ఆస్తులను అప్పగించడం దారుణమన్నారు. చెరకు రైతులకు చెల్లించాల్సిన బకాయిలు నాలుగేళ్లవుతున్నా నేతమ్స్, మయూరి పరిశ్రమ యాజమాన్యం చెల్లించలేదన్నారు. చెరకు రైతులకు బకాయిలను వెంటనే చెల్లించి, తక్షణమే మూసివేసిన చెరకు పరిశ్రమలను తెరిపించాలని, చెరకు రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల పిడుగుపాటుకు మృతిచెందిన రైతు కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కొక్కరికి పది లక్షల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. కురుస్తున్న అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాసరి జనార్ధన్, హేమలత, అంగేరి పుల్లయ్య, శివకుమార్, ధనంజయలు, శంకరయ్య, బత్తెమ్మ, ముని శంకర్, వెంకటేశు, కష్ణయ్య, మణి, గంధం మణి, పెనగడం గురవయ్య, నాగలాపురం నాగరాజు పాల్గొన్నారు.



రైతుసంఘం సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు వి.క్రిష్ణయ్య

ఫుట్‌బాల్ రన్నరప్‌గా చిత్తూరు

ప్రజాశక్తి-తిరుపతి సిటి



ఏపి సిఎం కప్ పోటీల్లో బాగంగా శుక్రవారం జరిగిన ఫుట్‌బాల్ ఫైనల్స్‌లో విజయనగరం విజయం సాధించిగా, చిత్తూరు జట్టు రన్నరప్‌గా నిలిచింది. అంతకుముందు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కబడ్డీ పోటీలలో బాలిక విభాగం ప్రథమ స్థానం, బాలుర విభాగం మూడవ స్థానంలో నిలవడం పట్ల తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వై ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు తిరుపతి జిల్లా బాలికల జట్టు అత్యుత్తమమైన ప్రదర్శన చేశారని భవిష్యత్తులో మరిన్ని టోర్నమెంట్లో విజయం సాధిస్తారని ఆకాంక్షించారు. తదనంతరం చిత్తూరు జిల్లా, విజయనగరం జిల్లా ఫుట్బాల్ ఫైనల్స్ విజయనగరం జిల్లా చిత్తూరు జిల్లా మధ్యన జరిగే మ్యాచ్ ప్రారంభానికి ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వై ప్రవీణ్ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు. డైనమాస్ ఫుట్బాల్ క్లబ్ సీనియర్ ఫుట్బాల్ ప్లేయర్స్ వీరికి పరిచయ కార్యక్రమం చేశారు ఈ మ్యాచ్లో విజయనగరం జిల్లా 3 గోల్స్ వేయగా చిత్తూరు జిల్లా ఒక గోల్ వేయడంతో విజయనగరం జిల్లా విజేతగాను చిత్తూరు జిల్లా రన్నర్స్ గాను నిలిచారు.

కార్ల్ మార్క్స్ సిద్ధాంతాలను కొనసాగిద్దాం

సిపిఎం నగర కార్యదర్శి సురేంద్రన్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మార్క్సిస్టు మహోపాధ్యాయుడు, సిద్ధాంతకర్త కార్ల్‌మార్క్స్ 205 వ జయంతి సందర్భంగా సిఐటియు కార్యాలయంలో శుక్రవారం కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈసందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి సురేంద్రన్ మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ ప్రపంచ మేధావి, ఆర్థికవేత్త, రాజకీయవేత, సమ సమాజం కోసం అహర్నిశలు కషిచేసిన వ్యక్తి అన్నారు. దాస్ క్యాపిటల్, కమ్యూనిస్టు ప్రణాళిక, రచించిన యోధుడని, శ్రామికుల కోసం కషి చేసిన కార్ల్ మార్క్స్ ఆశయాలను సిద్ధాంతాలను కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం, ఎ. దాములు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుని మృతికి నివాళి



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండల వైసిపి నాయకులు, రిటైర్ట్ టీచర్ బండి దామోదర్ రెడ్డి మృతికి ఉపముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి నివాళి అర్పించారు. మండలంలోని మారేపల్లిలోని సొంతింటిలో శుక్రవారం అనారోగ్యంతో దామోదర్ రెడ్డి మరణించారు. విషయం తెలుసుకున్న ఉపముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి దామోదర్‌రెడ్డి మతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి వెంట బండి గోవర్ధన్ రెడ్డి, బండి హేమసుందర్ రెడ్డి, జెడ్‌పిటిసి చల్లపాలెం సుకుమార్, బట్టే సుబ్రమణ్యం, కామసాని పద్మనాభరెడ్డి తదితరులు ఉన్నారు.

మన్నెమ్మ మృతికి చిట్టిబాబు నాయుడు నివాళి


కార్వేటినగరం: మండల పరిధిలోని మిట్టకండిగా గ్రామానికి చెందిన టిడిపి నాయకురాలు మన్నెమ్మ అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మతిచెందారు. సమాచారం అందుకున్న జిడి నెల్లూరు టిడిపి కోర్డినేటర్ చిట్టిబాబు నాయుడు మన్నెమ్మ మతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల పార్టీ చెంగల్రాయల్ యాదవ్, నాయకులు బీగాల రమేష్, సోమశేఖర్ యాదవ్, సందని సుబ్బారాయులు, హరి, రాజేష్, తదితరులు పాల్గొన్నరు.

మాజీ సర్పంచికి పరామర్శ

మండలంలోని సీడీకంద్రిగ వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ వీరాస్వామి మందడి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం అందుకున్న జాతీయ యాదవ సంఘం అధ్యక్షుడు అన్నా రామచంద్ర యాదవు శుక్రవారం పరామర్శించి శాలువతో ఘనంగా సన్మానించారు. అన్నా రామచంద్రయాదవు మాట్లాడుతూ వీరాస్వామి మందడి సర్పంచ్‌గా పంచాయతీకి ఎంతో అభివద్ధి చేశారని పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం యాదవ్, ఆనంద మందడి, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సుబ్రమణ్యం యాదవ్, శ్రీనివాసులు యాదవ్ ఉన్నారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని కటికపల్లి పంచాయతీ పిల్లిగుండ్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు శ్రీనివాసులు నాయుడు అనారోగ్యంతో మతిచెందారు. సమాచారం తెలుసుకున్న గంగాధర నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త భీమినేని చిట్టిబాబు నాయుడు మండల పార్టీ టిడిపి అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు మండల రైతు అధ్యక్షులు కటికపల్లి మాజీ సర్పంచ్ బాబు నాయుడు, జిల్లా తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కటికపల్లి శేఖర్, కటికపల్లి మాజీ ఎంపీటీసీలు వేమన్న నాయుడు, కెఎం. రవిలు, జగదీష్ నాయుడు, కిషోర్ నాయుడు, నిరంజన్ రెడ్డి, సిద్దయ్య శెట్టి మతదేహానికి నివాళులర్పించారు.

గరుడ వాహనంపై నారాయణుడు



ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: వేపంజేరి గ్రామంలో గల శ్రీలక్ష్మీ నారాయణుడు గరుడ వాహనంపై అధిరోహించగా పలువురు భక్తులు శుక్రవారం దర్శించుకున్నారు. చిత్ర పౌర్ణమి సందర్భంగా ఆలయంలో లక్ష్మీనారాయణులకు అర్చకులు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ కళ్యాణోత్సవం పూజలు నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం గరుడ వాహనంపై నారాయణుని విగ్రహాన్ని అధిష్టించి భక్తులకు దర్శనభాగం కలిగించారు. ఉభయదారులుగా శేషాద్రి రంగస్వామి, తిమ్మిరెడ్డిపల్లెకు చెందిన రమ్య వ్యవహరించారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశులు రెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో డిప్యూటీ మేయర్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీలో వేసిన శ్రీద్రౌపతి ధర్మరాజుల సమేత మహాభారతం ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని చిత్తూరు డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి దర్శించుకున్నారు. శుక్రవారం అమ్మవారి నైవేద్యం సమయంలో ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో వారికి దర్శన ఏర్పాట్లను చేశారు. ఆలయ పూజారి మర్యాదలతో డిప్యూటీ మేయర్‌కి స్వాగతం పలికి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. ద్రౌపది అమ్మవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయ దారులుగా రిటైర్డ్ టీచర్ దామోదరం రెడ్డి, భానుమతి కుటుంబ సభ్యులు వ్యవహరించి అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారు పురవీధుల్లో ఊరేగింపు చేశారు. దేవరాజు నాయుడు, బాబులు, భరత్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఆలయ ధర్మకర్త నాగరాజు, సురేష్ రెడ్డి, మణి, మధు పాల్గొన్నారు.

వైభవంగా చిత్రాపౌర్ణమి ఉత్సవాలు

ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధిలోని ఆలయాల్లో శుక్రవారం చిత్రాపౌర్ణమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. పుదుపేట నాగాలమ్మ ఆలయంలో 8వ సంవత్సర చిత్రాపౌర్ణమి ఉత్సవాలను పురస్కరించుకొని ఉదయం వినాయక ఆలయం నుంచి నాగాలమ్మ ఆలయం వరకు 108 పాలకుండలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి అభిషేకం చేశారు. ఆలయం వద్ద భక్తులు అంబలి, కుంభం సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కర్పూర హారతులు ఇవ్వగా భక్తులు దర్శించుకున్నారు. రాత్రి భక్తులకు ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక ఓంశక్తి ఆలయం వద్ద చిత్రాపౌర్ణమిని పురస్కరించుకొని పాదచారులకు అంబలి, మజ్జిగ పంపిణీ చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు చేశారు.